# డిటెక్టివ్ సుందరి

* శ్రీ కందుకూరి లింగరాజుగారు *

బీరువాలో బట్టలుసద్దుతున్నా. చాకలి తెచ్చినవి నా కోసం అని ఎదురుచూస్తూ మంచంమీదవున్నవి. క్రితం రేవులో వేసిన, చార్ల చొక్కా రాలేదు. అప్పుడు అనుకున్నా మాసిపోయిన వానిలో పడిందేమో అని. పద్దువేసేటప్పుడు ఆ చొక్కా లెఖ్ఖలోకి రానేలేదు. ఏమయింది అన్న ఆలోచనకు సమాధానం దొరకలేదు. పైగా బనీన్లలో రెండు కనుపించటం లేదుకూడాను. నేను ఏ పాకీవానికైనా ఇచ్చినట్టూ జ్ఞాపకం లేదు. ఏ సమయంలో అయినా సుందరి, పాతది, చిరిగడానికి సిద్ధంగావుంది అని ధర్మం చేసిందేమో కనుక్కోవాలి అనుకునే బీరువామూసాను.

సావిట్లోకి వచ్చేటప్పటికి సుందరి "రొట్టె, కాఫీ బల్ల మీద పెట్టేనండీ" అంది. "రొట్టె కాఫీ రోజూ వుండేదే చార్లచొక్కా మాత్రం మాయమై పోయింది" అని లోపల గువులుకున్నా.

సుందరీ తనవాటాతో వచ్చి ఎదురుగా కూర్చుంది. నాకు రొట్టె దిగటంలేదు. కాఫీరుచిగావున్నట్టూ తట్టలేదు. సుందరి తనపని యధాలాపంగానే చేసేస్తోంది. నేను తినక పోవడంతో ఓసారి తలెత్తిచూచి, బహుశః మళ్ళీ కథవ్రాయడం కొరకు తల్లో ఏదైనా కుమ్మరిపురుగు దొలుస్తోంది కాబోలు అనుకునే వంచుకుంది.

చెప్పనా, ఒద్దా అన్న సందిగ్ధం నన్ను ఇరుకున కూర్చోపెడుతోంది. చెపుదామన్నా ఎల్లామొదలు పెట్టాలో తెలియని స్తబ్దత నన్ను కూర్చోపెట్టింది.

"మొన్న ఆ కాందిశీకికి నా జాకెట్టు, చీరా ఇచ్చానా ఏమిటి?" సూటిగావేసింది.

తెల్లబోయే, "లేదే"

"అవికనుపించటం లేదండి!"

"నాచార్లచొక్కా, బనీనులు కూడా కన్పించటంలేదు. నిన్ను అడుగుదామనుకుంటున్నా." పీఠికా ప్రారంభం అటు వైపునుండి వచ్చినందుకు సంతోషపడుతూ.

"ఏమిటీ?" ఆశ్చర్యంలోనే అంది.

"మాయమై పోయేయి"

ఏం మాట్లాడకుండా, తలోసారి పరికించి, కప్పులు, సాసర్లూ లోపలికి తీసుకువెళ్ళిపోయింది. మౌనం నన్ను ఇరుకున పడేసింది. ఏదో అనునయంగా ఓ చూపో, కనుక్కుంటా అన్న ఆశో, వెతుకుతా అన్న ఆతృతో కన్పరిస్తే ఇంతగా బాధపడే వాణ్ణికాదు.

ఆ రెండుచేతుల బరువుతోనూ, ఆవ్రగా, కుదుమట్టంగా మధ్యపాపిడి, తేనెరంగు కళ్ళతోఉన్న సుందర్ని చూస్తుంటే పెళ్ళయి తొమ్మిది నెలలు దాటింది. ఇంకా ఎంతకాలానికి ఈ విడిని అర్థంచేసుకోగలనా అన్న ప్రశ్న నన్ను అడుగుతోంది.

అసలు సుందరివచ్చినప్పటినుండే జీవితాన్ని రెండు దృక్పథాల్తో చూడవలసి వస్తోంది.

* * *

దీపావళికి కావలసిన సరకులు కొనుక్కొని చీకటిపడే వేళకి ఇంటికిచేరాను. కాంపౌండు గేటు తీసేటప్పటికి ఇంట్లో ఏదో రాద్ధాంతం జరుగుతోందనిపించింది. సుందరి ఎవర్నో తిట్టేస్తోంది.

గుమ్మంమెట్లు ఎక్కా. సావిట్లో పనిచేసే అప్పలమ్మ, కుర్రాడు వెంకన్న, బంట్రోతు సూరన్న, పిల్లలక్ష్మి, నుంచునివున్నారు. సుందరి ఎదురుగానుంచుని, అప్పలమ్మని నువ్వు "తీసేవా? లేదా?" అని నిలదీసి అడుగుతోంది.

వీధిగుమ్మానికి అర్థంకాక చేర్లపడ్డా. "నేను నిన్ను మేడ మీద అలమార్లో అద్దం, దువ్వెన్నా ఉందని పంపింతే అద్దం అవీ తెచ్చియిచ్చేవు. ప్రక్కగావున్న ఐదురూపాయలచిల్లర్లోను పావలా ఎలా తక్కువవుతుంది?" అప్పలమ్మ తలవంచేసింది.

"మాట్లాడవేం సూరన్నా! అక్కడ చిల్లర పావుఘంట క్రితం నువ్వేయెంత పెట్టేవు?"

"ఐదురూపాయలదండి అమ్మగారు?"

"మరి పావులా ఎల్లా తక్కువైంది. నేను కూడా వెళ్ళి చూచానే..."

ఆ వరసలో అప్పలమ్మ దూషిత్వాన్ని ఋజువు పరచింది. వెంకన్నా, సూరన్నా, లక్ష్మీ కూడా అప్పలమ్మకి ఏ సహాయం చెయ్యలేక పోయేరు.

అప్పలమ్మ, సిగ్గుతో కుళ్ళిపోయే, తప్పిదం ఒప్పుకుంది. నాకు జాలికల్గుతోంది.

"అయితే, అయ్యగారి చొక్కా, బనీనులు, నాచీర, జాకెట్టూకూడా నువ్వే మాయంచేసేవన్నమాట ..అవునా?

ఆ అడగడంలోని ప్లీడరీ నన్ను ఆశ్చర్యపరిచింది. కూడా ముగ్గురు తెల్లబోయేరు. ఈ సారి ఎవరి భుజాల మీద నేరం పడుతుందో అని.

"అసలు బుద్ధిపుట్టకూడదు పుట్టిందాఒదలదు. నిజంచెప్పు తీసేవా?" సుందరి నిల్తొక్కింది.

"వాళ్ళందర్నీ కూడా మేడమీదికిపంపానే. ఒకళ్ళూ అంత చిల్లరవుంటే తియ్యలేదు. నీకే ఆబుద్ధివుంది..."

అప్పలమ్మకి ఇకనోరు కుట్టినట్టేఅయ్యింది. ముగ్గురు తేలిక పడ్డారు. ఏడుస్తూనే "దొంగిలించేనండి క్షమించండి...ఇంకెప్పుడూ అల్లాంటి పనులు చెయ్యనండి..."అని ఏడ్చింది.

"మరి అల్లాంటివి చెయ్యవచ్చా? నిన్నునమ్మకునే కదా ఇల్లంతా ఒదిలివేసే..."అంది.

ఇంకేం అనకుండానే వాళ్ళని వెళ్ళమంది. అప్పలమ్మ గుమ్మందాటుతుంటేనే 'అప్పలమ్మ' అంది. దాంతో ప్రాణాలు పోయేయిదానికి. "రేపుపనిలోకి రావడంమానకు. దీపావళి పండుగ కూడాను" అంది.

అంతవరకూ కూలివాడి నెత్తిమీదసామాను అల్లాగేవుంది. నేను గుమ్మానికిఆనుకునే ఉండిపోయా. "రండి" అంటూనే చిరునవ్వు నవ్వేసింది. నవ్వుతుంటే బుగ్గలు అందంగా సొట్ట పోతాయి సుందరికి.

లోపల అడుగుపెడుతూనే "అయితే శ్రీమతి 'డిటెక్టివ్' సుందరిగారు దొంగని పట్టుకున్నారన్నమాట."

"పోదురు! మీదంతా వేళాకోళం"

"అబ్బెబ్బె! లేదు మీరంటే గౌరవం" అన్నా.

ఒక్కటి మాత్రం నాకు అర్థంకాలేదు. ఒక్కఅప్పలమ్మ తీసిందని నిర్ధారణఏముందీ అని ఆలోచించా భోజనంచేసేటప్పుడూ...

"సాయంత్రం నాలుగు అలమారులలోను చిల్లర పెట్టే. నలుగుర్నీ నాలుగుపనులు పురమాయించిపంపే ఒక్క అప్పలమ్మ వెళ్ళిన అలమారులోనే పావులా తక్కువైంది..."

ఇక అర్థమే అయ్యింది.

మర్నాడు అప్పలమ్మని మధ్యాహ్నం పిలిచి, చీర ఒకటి ఇస్తూనే "ఎప్పుడూ అల్లాంటిపని చెయ్యకూ. అడిగితే నేనివ్వనా, బాబుగారివ్వరా?" అంది.

అప్పలమ్మ ఓసారి నమ్మలేని కళ్ళతో నమస్కారం చేస్తూనే గుమ్మందాటింది. కళ్ళప్పగించి అల్లా చూస్తూవుండి పోయే.

"ఏమిటీ చూస్తున్నారు" అంది కొంటెగా ద్రిగ్రేట్ డిటెక్టివ్ సుందరిగారు. 'హూ' అంటూనే చేతులు భుజం మీదవేసి "భయపడకండి...దేవుడు అభయహస్త మిస్తున్నాడు"అంది.

నవ్వుకున్నాం.

★